క్లుప్తంగా

నూతన వధూవరులకు ఎంపీ కేశినేని నాని ఆశీర్వాదం



విస్సన్నపేట: కొండపర్వ సొసైటీ అధ్యక్షుడు గొట్టిపూళ్ల చంద్రశేఖర్ కుమారుడు వివాహ రిసెప్షన్ కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం

ముసునూరు: మండలంలోని రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండల యూత్ కన్వీనర్ గూట్రు రంగారావుతో కలిసి ఎమ్మెల్యే ప్రచార కార్యక్రమాల వివరాలు తెలిపారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు రమణక్కపేటలో ప్రచారం ప్రారంభమై, అక్కిరెడ్డిగూడెంలో కొనసాగుతుందన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

విజయవాడ సబ్ కలెక్టర్ భవానీ శంకర్



మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విజయవాడ సబ్ కలెక్టర్ బి.భవానీ శంకర్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల తీరుతెన్నులు, నిర్వహణ విధానాన్ని, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ నుంచి అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని వివరించారు. మైలవరం తహసీల్దార్ టీఆర్.రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చిట్టిబాబు



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో పాటు టీడీపీలో చేరిన తుమ్మలపాలెం గ్రామ కన్వీనర్ చింతల చిట్టిబాబు తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెత్తందారుల మాయమాటలతో టీడీపీలో చేరినప్పటికీ అక్కడ ఇమడలేక పోయానని, వైఎస్సార్ సీపీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామ కన్వీనర్‌గా ఉన్నానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు గెలుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతిరావు సూచించారు. పార్టీ సీనియర్ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

తిరువూరు: తిరువూరు బార్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. కోర్టు ఆవరణలోని బార్ రూంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా వాకదాని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గౌసుద్దీన్, ఉపాధ్యక్షుడిగా జీవన్‌బాబు, కోశాధికారిగా దూపకుంట్ల జ్వాలా నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన మేకల రవి తెలిపారు. కొత్త కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

30న ఉచిత నేత్ర వైద్య శిబిరం

మైలవరం: మైలవరం పోస్టాఫీస్ ప్రాంగణంలో ఈ నెల 30న ఆయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అధునాతన వైద్య పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ అందజేస్తారని చెప్పారు.

త్వరలో తాగునీటి సమస్యలకు చెక్







సాయిపురం కాలనీలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

- గొల్లపూడి గ్రామస్తులకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు
- శరవేగంగా నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణం
- ఎమ్మెల్సీ తలశిల రఘురాంకు గ్రామస్తుల కృతజ్ఞతలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం కానుంది. గ్రామంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మరో వాటర్ ఫిల్టర్ బెడ్ ఆవశ్యకతను గుర్తించిన స్థానికుడు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయించారు. దాంతో సాయిపురం కాలనీలో 5 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభమైంది. ప్లాంట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండగా త్వరలో తమ నీటి కొరత తీరనున్నందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు పుష్కర కాలం కిందట అప్పటి గ్రామ జనాభా అవసరాల మేరకు వాటర్ ఫిల్టర్ బెడ్ నిర్మించారు. అనంతరం పెరిగిన జనాభా అవసరాలకు సరిపోకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వ పాలకుల దృష్టికి ప్రజలు తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారు. అందులో భాగంగానే తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఏడాదిన్నర కిందట రూ.10 లక్షలతో వాటర్ ఫిల్టర్ బెడ్‌ను ఆధునీకరించారు. ఇప్పుడు మరో ప్లాంట్‌ను నిర్మిస్తుండటంపై స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రూ.11 కోట్లతో 5 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

దినదినాభివృద్ధి చెందుతున్న గొల్లపూడి గ్రామంలో నివసించే జనాభా కూడా పెరిగింది. ప్రస్తుతం ఉన్న వాటర్ ఫిల్టర్ బెడ్ ద్వారా సరఫరా అయ్యే మంచినీటికి కొరత ఏర్పడటంతో 65వ నెంబర్ జాతీయ రహదారికి (వన్ సెంటర్) అవతల సాయిపురం కాలనీలో సుమారు రూ.11 కోట్ల వ్యయంతో రోజుకు ఐదు మిలియన్ లీటర్ల (5 ఎంఎల్‌డీ) కృష్ణా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అనుబంధ ట్యాంక్‌లు, పైప్‌లైన్లను సాయిపురం కాలనీలో నిర్మిస్తున్నారు. కృష్ణానదిలో ఒక వెల్ నిర్మించి అక్కడి నుంచి పైప్‌లైన్ ఇక్కడి వరకు ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడికి నేరుగా వచ్చే రా వాటర్ ఒక చోటకు చేరుతుంది. అక్కడి నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి వచ్చి శుద్ధి అయ్యి పక్కనే ఉన్న సంప్‌లోకి పంపింగ్ అవుతుంది. ఆ నీరు కాలనీలోని పలు నివాసాలతోపాటు శ్రీనివాస నగర్, సిద్ధార్థ నగర్ తదితర ప్రదేశాల్లోని రిజర్వాయర్లలోకి వెళుతుంది. అంటే గ్రామ జనాభాలో సగం మందికి గతంలో ఉన్న వాటర్ ఫిల్టర్ బెడ్ నీటి అవసరాలను తీరిస్తే మిగిలిన సగం మంది జనాభాకు నిర్మాణంలో ఉండి మరో 5–6 నెలల్లో అందుబాటులోకి రానున్న 5 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వారి మంచినీటి అవసరాలను తీర్చనుంది. రక్షిత మంచినీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు చొరవ చూపిన స్థానికుడు ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గ్రామంలో అభివృద్ధి అనేది ఏదైనా కనబడుతుందంటే అది వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతేనని గ్రామస్తులు చెబుతున్నారు.

మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు



మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

రెడ్డిగూడెం: పేదవాడికి, పెత్తందారులకు జరుగుతున్న యుద్ధంలో సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నన్ను ఎమ్మెల్యేగా, కేశినేని శ్రీనివాస్(నాని)ని ఎంపీగా గెలిపించి మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని పాత నాగులూరు, కొత్తనాగులూరు, తాడిగూడెం, రంగాపురం, ఓబులాపురం, రుద్రవరం గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో తిరుపతిరావు మాట్లాడుతూ సీఎం జగనన్న ఆశయాలకు అనుగుణంగా రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల కన్వీనర్ బలగాని తిరుపతిరావు, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈర్ష్యతోనే వలంటీర్లపై టీడీపీ నాయకుల ఆరోపణలు

మైలవరం: వలంటీర్ల సేవలను చూసి ఈర్ష్యతోనే వారిపై టీడీపీ నాయకులు అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్ల సేవలను చూసి చంద్రబాబుతో పాటు తెలుగుదేశం నేతల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి కాబట్టి వారిపై ఆ పార్టీ నేతలతో పాటు దత్తపుత్రుడి నోట్లో నుంచి కించపరిచే మాటలు వస్తున్నాయన్నారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల దురాగతాలకు ప్రజలు గగ్గోలు పెట్టారని, పేదల కడుపు కొట్టి జన్మభూమి కమిటీలు వారి జేబులు నింపుకోవడానికే పరిమితమయ్యారన్నారు. వలంటీర్లను ఉగ్రవాదులు, జీహాదీలతో పోల్చడం అత్యంత అవమానకరంగా మాట్లాడుతూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను టీడీపీ నాయకులు వెనక్కి తీసుకుని వారికి క్షమాపణ చెప్పాలని కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

9వ వార్డులో 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం'



మాట్లాడుతున్న సుధారాణి

తిరువూరు: మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమం స్థానిక తొమ్మిదో వార్డులో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి వార్డులో పర్యటించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వం పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. తిరువూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు స్థానికుడని, అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, కాకర్లమూడి సుందరకుమార్, పరసా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 25 మంది గైర్హాజరు

మైలవరం: మైలవరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మంగళవారం 25 మంది రెగ్యులర్ విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఎల్. బాలు తెలిపారు. 26న సామాన్య శాస్త్రం (నేచురల్ సైన్స్) పరీక్ష జరిగిందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 1,101 మందికి గాను 1,076 మంది హాజరయ్యారన్నారు. 225 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 142 మంది విద్యార్థులు హాజరు కాగా 83 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

ముసునూరు మండలంలో 61 మంది గైర్హాజరు..

ముసునూరు: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు మండలంలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు కలిపి 644 మంది హాజరయ్యారని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ముసునూరులో 215 మంది, చెక్కపల్లిలో 259 మంది, గోపవరంలో 170 మంది, మొత్తం మూడు కేంద్రాల్లో కలిపి 705 మంది విద్యార్థులకు 644 మంది పరీక్ష రాయగా 61 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ముసునూరులో 11 మంది, చెక్కపల్లిలో 31 మంది, గోపవరంలో 19 మంది విద్యార్థులు చొప్పున మొత్తం 61 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని వివరించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ



పాలిసెట్ ఉచిత కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే పాలిసెట్–2024లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించిన రశీదును చూపించి ఈ నెల 31వ తేదీలోగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతి రోజు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు 94926 85021 మొబైల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పాలిసెట్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిసెట్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా విద్యార్థులకు ఉపయోగపడేలా ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సీనియర్ ఉపాధ్యాయులచే క్లాసులు నిర్వహించడంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామని తెలిపారు. గత 10 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులు ఉచిత కోచింగ్ తీసుకొని మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు ఎస్కే.జాహిదా, భార్గవ, బి.మాధవ్, టి.ప్రణీత మణికంఠ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎనలైజర్ ఏర్పాటు

తిరువూరు: ఏకొండూరు మండలం మారేపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాల నాణ్యత పరిశీలించే ఎనలైజర్‌ను ఏర్పాటు చేశామని లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివ మూర్తి తెలిపారు. రైతులు సరఫరా చేసే పాలలో నాణ్యత పరిశీలనకు ఆధునిక యంత్రపరికరాలను సమకూరుస్తున్నామన్నారు. సబ్సిడీపై పశువులకు దాణా, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ యూనియన్ ద్వారా జరుగుతోందని చెప్పారు. కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ తదితర పథకాలను రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్నామన్నారు. జిల్లా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పల్నాటి సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుశీల పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో చిన్న తిరునాళ్ల

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు గ్రామం నుంచి గురువారం వచ్చే పసుపు కుంకుమల బండ్లు కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని డీసీపీ కె. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కార్యక్రమానికి సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నందిగామ ఏసీపీ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ రాంబాబుతో కలిసి సమీక్షించారు. తొలుత ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించి ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజుకు పలు సూచనలు చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పుట్టింటి పసుపు–కుంకుమల కార్యక్రమానికి భారీగా భక్తులు వస్తారని, స్పత బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

ఏఐసీసీ గౌరవాధ్యక్షుడిగా కేటీ ప్రభాకర్‌రావు



నూజివీడు: పాస్టర్స్ ఫెలోషిప్ నూజివీడు డివిజన్ చైర్మన్ కేటీ ప్రభాకర్‌రావు అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన కోర్ కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే పాస్టర్స్ ఫెలోషిప్ నూజివీడు డివిజన్ కమిటీ కోశాధికారిగా ఉన్న బిషప్ జీవరత్నంను ఏఐసీసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ ప్రభుకిషోర్, గౌరవాధ్యక్షుడిగా పాస్టర్ పైడిపాముల ఇమ్మానుయేలు, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ పల్లెపాము వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బిషప్ తలారి సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. అలాగే నూజివీడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా పాస్టర్ సురేష్, కోశాధికారిగా పాస్టర్ రాజు, ఉపాధ్యక్షుడిగా బాణావతు నాయక్, నూజివీడు పట్టణ అధ్యక్షుడిగా పి దేవసహాయం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేటీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్ డెన్నీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సేవలో ఎన్టీటీపీఎస్ ఉద్యోగి



ఎమ్మెల్యే వసంతకు పసుపు చొక్కా ధరించి బొకే అందిస్తున్న ఎన్టీటీపీఎస్ ఉద్యోగి శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ఎకౌంట్ సెక్షన్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న కరిమికొండ శ్రీనివాసరావు టీడీపీ సేవలో మునిగితేలుతున్నాడు. రెండురోజుల కిందట కొండపల్లి వచ్చిన ఎమ్మెల్యేకు శ్రీనివాసరావు పసుపు చొక్కా ధరించి పూలబొకే అందజేసి సంఘీభావం తెలిపారు. ఇప్పటికే టీడీపీ సానుభూతిపరులుగా ఉంటున్న వారి కుటుంబంలో ఉద్యోగిగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను కలవడం చర్చనీయాంశమైంది. ఎన్టీటీపీఎస్ ఉద్యోగి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడంపై స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

30న నగరంలో 'రన్ ఫర్ జీసస్'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్, బందెల దయానందం, కరుణానిధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఈ నెల 30వ తేదీ ఏర్పాటు చేసిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ విభాగం చైర్మన్ రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం కోరారు. స్థానిక మధురానగర్ జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో మంగళవారం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుందన్నారు. యావత్ క్రైస్తవ సమాజం ఎటువంటి డినామినేషన్ లేకుండా రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొని ఏసుక్రీస్తు త్యాగాన్ని చాటాలని పిలుపునిచ్చారు. 30వ తేదీ శనివారం ఉదయం 5.30 గంటలకు నిర్మలా కాన్వెంట్ సమీపంలోని సెయింట్ కెథడ్రల్ చర్చి నుంచి రన్‌ఫర్ జీసస్ ర్యాలీ బయలుదేరి స్టేట్ గెస్ట్ హౌస్ సమీపంలోని సెయింట్ పాల్స్ బసిలిక చర్చి దగ్గర ముగుస్తుందని తెలిపారు. రోమన్ క్యాథలిక్స్ ప్రతినిధి రెవరెండ్ ఫాదర్ మువ్వల ప్రసాద్, సీఎస్ఐ సౌత్ ఇండియా ప్రతినిధి రెవరెండ్ కరుణానిధి, మరనాత సమాజం ప్రతినిధి రెవరెండ్ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. రన్‌ఫర్ జీసస్ ఐక్యత, శాంతికి నిదర్శనంగా పేర్కొన్నారు. నగరంలోని క్రైస్తవులందరూ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. క్రైస్తవ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, నగరంలోని పాస్టర్లు, సేవకులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

కంచికచర్ల: మండలంలోని కీసర టోల్‌ప్లాజా, పరిటాల పోలీస్ అవుట్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం, నగదు రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. నగదు అక్రమ రవాణాకు చెక్ పెట్టేలా నేషనల్ హైవేపై హైద్రాబాద్ వైపు నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు తదితర పట్టణాలకు వచ్చే పలు వాహనాలను క్షుణంగా తనిఖీలు చేశారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శోభన్‌బాబు
- సందడిగా కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే




డిగ్రీ పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కే శోభన్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రాడ్యుయేషన్ డే (డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం) కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం అత్యంత సందడిగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు తమతమ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను గమనిస్తూ ఆయా అంశాలపై పట్టు సాధించాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. కేబీఎన్ కళాశాల విద్యార్థులుగా సమాజంలో ప్రత్యేకతను చాటే విధంగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

1,024 మందికి పట్టాలు

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. 2022–2023 విద్యా సంవత్సరంలో కళాశాల పలు విజయాలను సొంతం చేసుకుందన్నారు. కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సులతో పాటుగా పలు యూజీసీ స్పాన్సర్స్ కోర్సులను అందిస్తున్నామని చెప్పారు. 2022–2023 సంవత్సరం డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన 1,024 మంది విద్యార్థులకు పట్టాలను అందించారు. కళాశాల విద్యాబోధనతో పాటు అనుబంధ విభాగాలుగా ఉన్న క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, డ్రమెటిక్ అసోసియేషన్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి, భావ వ్యక్తీకరణ వంటి అంశాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనుగుంట్ల శ్రీనివాసు తొలుత సభకు స్వాగతం పలికారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శోభన్‌బాబు విద్యార్థులు గౌరవ వందనంతో సభావేదిక వద్దకు తీసుకెళ్లారు. అలాగే పోలీస్‌శాఖ వారి ప్రత్యేక బ్యాండ్ అతిథులకు స్వాగతం పలికింది. వందలాది మంది విద్యార్థులు ప్రత్యేక గౌను వేసుకొని ముఖ్యఅతిథి చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు టి.శేషయ్య, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడానికి చర్యలు



కీసర మున్నేటి ఒడ్డున బోరు వేసేందుకు కొబ్బరికాయలు కొడుతున్న సర్పంచి రవికుమార్

కంచికచర్ల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని కీసర మున్నేటి ఒడ్డున గండేపల్లి గ్రామానికి తాగునీరు సరఫరాకు పంచాయతీ నిధులు రూ.1.10లక్షలతో కొత్త బోరుపంపు వేసేందుకు కొబ్బరికాయలు కొట్టి మంగళవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ మండలంలోని కీసర మున్నేటిలో నీటి నిల్వలు అడుగంటి పోవటంతో బోరు పంపులకు నీరు అందక విద్యుత్ మోటార్లు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. గండేపల్లి గ్రామానికి తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అయితే ఒక మోటార్ ద్వారా గ్రామానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా కావడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దగ్ధమైన బోరు పంపును తొలగించటంతో పాటు మరో ప్రదేశంలో బోరు వేసేందుకు అధికారుల అనుమతులు తీసుకున్నామని తెలిపారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఉపసర్పంచి బీవీ సుబ్బారావు, మట్టా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

కంచికచర్ల : త్వరలో రాష్ట్రంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు మంగళవారం తొలగిస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు కూడా ముసుగులు వేస్తున్నారు. విద్యుత్ పోల్స్, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఫ్లెక్సీలు తొలగిస్తున్నామని తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు పాటించాలన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ. 5.48 లక్షలు



విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. 63 రోజులకు గాను రూ.5,48,837 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. వేద్రాది ఈఓ ఎస్. హేమలతాదేవి పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పోతనపల్లి గ్రామానికి చెందిన బాణావతు సక్రు మంగళవారం సాయంత్రం సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: విస్సన్నపేట మండలం నరసాపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు.

చనుబండ, కోటపాడు, పోలవరం, చాట్రాయి, జనార్దనవరం గ్రామాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, రైతులు సహకరించాలని కోరారు.